క్లుప్తంగా

బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం



జనగామ: పట్టణంలోని 30వ వార్డులో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు భువనగిరి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ గెలుపు కోరుతూ దళితరత్న అవార్డు గ్రహీత తిప్పారపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆయన వెంట వార్డు అధ్యక్షుడు పులి భరత్, కార్యదర్శి గడిపె రాజు, బొట్ల సాయి, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే ‘పల్లా’



స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. అదే సమయంలో హనుమకొండకు వెళ్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన కారును ఆపి గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స చేసి కుటుంబ సభ్యులకు, 108 వాహనానికి సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పరామర్శ

జనగామ: ఇటీవల అనారోగ్యానికి గురై ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జనగామ మండలం యశ్వంతాపూర్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త గద్దం రమేశ్‌ను మంగళవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. అనంతరం డాక్టర్లతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి అధైర్యపడొద్దని, ఆర్థికసాయం అందించి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

కాంగ్రెస్‌లో చేరిక



బచ్చన్నపేట: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గిద్దెల రమేశ్ హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు మంత్రి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ సొంతగూటికి చేరుకున్నానని టీఆర్‌ఎస్ పార్టీలో ఇమడలేక పోయానని అన్నారు. పార్టీ అభివృద్ధికి, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు పాటుపడతానని చెప్పారు. ఆయనతో పాటు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

ఎమ్మెల్యే కడియం సమక్షంలో..

చిల్పూరు: చిల్పూరుకు చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం ఎంపీపీ బొమ్మిశెట్టి సరితబాలరాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కోల రమేశ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ అభ్యర్థి కడియం కావ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మాచర్ల స్వామి, భీమగోని నరేష్, కాందూరి రంగరాజు, గనగోని రమేష్, పొన్నం శ్రీనివాస్ ఉన్నారు.

ఎంపీపీ, మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో..

జఫర్‌గఢ్: తమ్మడపల్లి (ఐ) గ్రామానికి చెందిన ఎంపీపీ రడపాక సుదర్శన్, మాజీ సర్పంచ్ గాదెపాక అనిత సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమక్షంలో హనుమకొండలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి శ్రీహరి కండువాలు కప్పి పార్టీలోకి అహ్వానించారు.

నియామకం



వినోద్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన చేపూరి వినోద్‌కుమార్‌ను టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్‌గా నియమించినట్లు మాజీ ఎమ్మెల్సీ, ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ కన్వీనర్ కపిలవాయి దిలీప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు వినోద్‌కుమార్ మంగళవారం ఘన్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో తాను చేస్తున్న కృషిని గుర్తించి టీపీసీసీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్‌గా నియమించడం సంతోషంగా ఉందన్నారు. పదవితో తన బాధ్యత మరింతగా పెరిగిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తానన్నారు. పదవిలో నియమించిన ఏఐసీసీ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్‌ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తదితరులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే దేశ సమగ్రాభివృద్ధి



కొడకండ్ల: ప్రచారంలో ఝాన్సీరెడ్డి తదితరులు



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న జయపాల్‌రెడ్డి



చిల్పూరు: మాట్లాడుతున్న రమేశ్

కొడకండ్ల: దేశ సమగ్రాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని పాకాల, కడగుట్టతండా, రామవరం, రామన్నగూడెం, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని ఆమె ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సురేష్‌నాయక్, జిల్లా మహిళా కాంగ్రెస్ కార్యదర్శి రోజా, యాకేష్‌యాదవ్, నాగరాజు, యుగంధర్‌రెడ్డి, మహేష్‌నాయక్, వీర్యానాయక్, యాకూబ్, శ్రీలేఖ పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర నాయకుడు బేతి జయపాల్‌రెడ్డి అన్నారు. వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు మద్దతుగా జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని తాటికొండ గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కడియం అంటేనే అభివృద్ధి అన్నారు. మాజీ సర్పంచ్ మార్క రాజమ్మశ్రీనివాస్, యూత్‌కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వసంత్, ఎండీ.హయాజ్, హాజం, మోసిన్‌అలీ, అరాఫత్ పాల్గొన్నారు.

సీపీఎం బలపర్చిన అభ్యర్థిని గెలిపించాలి

చిల్పూరు: సీపీఎం బలపర్చిన కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని పార్టీ మండల కార్యదర్శి సాదం రమేశ్ కోరారు. మండలంలోని కృష్ణాజీగూడెం గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మతోన్మాద బీజేపీని ఓడించాలని అన్నారు. సమావేశంలో గద్ద కుమార్, ఊరడి మల్లయ్య, నారబోయిన భిక్షపతి, సాదం ఐలయ్య, అశోక్, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి గుణపాఠం చెప్పాలి

● ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్: కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉండి తెలంగాణకు నిధులు ఇవ్వకుండా అన్యాయం చేసిన బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని తాటికొండ గ్రామంలో తాటికొండ, మీదికొండ, కొత్తపల్లి, జిట్టెగూడెం గ్రామాల ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలతో మంగళవారం ఎన్నికల ప్రచార కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిరతో కలిసి ముఖ్య అతిథిగా హాజరైన కడియం మాట్లాడారు. పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఒరగబెట్టిందేమి లేదని, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, స్టీల్ ఫ్యాక్టరీ ఇవ్వలేదన్నారు. ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు నాకు రాజకీయ జన్మనిచ్చారని, అదేస్థాయిలో నా బిడ్డను మీ బిడ్డగా ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బేతి జయపాల్‌రెడ్డి, రాపోలు మధుసూదన్‌రెడ్డి, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, ఇనుగాల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎడమ కట్టమల్లు, పండుగ భద్రయ్య, రత్నాకర్‌రెడ్డి, చెవుల యాదగిరి, బెల్లపు వెంకటస్వామి, మారపాక వసంత్, మార్క శ్రీను, మారపాక నాగరాజు, చల్లా తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సుధీర్‌కుమార్‌ను గెలిపించాలి



చిల్పూరు: మాట్లాడుతున్న రాజయ్య

చిల్పూరు: బీఆర్‌ఎస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే రాజయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగులు మార్చే ఊసరవెల్లిలా.. కడియం శ్రీహరి పార్టీ కండువాలు మారుస్తున్నారని, అలాంటి వారిని ప్రజలు నమ్మొద్దన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో పార్టీ మండల కోఆర్డినేటర్ జనగామ యాదగిరి, నాయకులు కృష్ణారెడ్డి, కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, ఆకుల కుమార్, మాలోత్ రమేశ్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటా ప్రచారం

స్టేషన్‌ఘన్‌పూర్: పార్లమెంట్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ ఉపసర్పంచ్ గుర్రం శ్రీను ఆధ్వర్యంలో మండలంలోని శివునిపల్లిలో మంగళవారం ఇంటింటా ప్రచారం చేపట్టారు. గడపగడపకు బీఆర్‌ఎస్ కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. పార్టీ గుర్రం శంకర్, గుర్రం యేసుబాబు, గాదె చిట్టిబాబు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: ఉద్యమకారుడైన వరంగల్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ కారు గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గూడ కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల వద్దకు ఆయన పార్టీ నాయకులతో కలిసి వెళ్లి వేతనదారులతో సమావేశమై బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్‌ఎస్ బూత్ కన్వీనర్లు ద్యావర యాకయ్య, ఇమ్మడిశెట్టి రఘురాం, మర్కాల మహేందర్, ఇమ్మడిశెట్టి కరుణాకర్‌రాజు, మల్కపురం అన్వేష్, కడారి సురేష్, శ్రీనివాస్, ఎండీ రహీం, పేర్ని అనిల్, ఎండీ అక్రం పాల్గొన్నారు.

తెలంగాణకు శ్రీరామరక్ష బీఆర్‌ఎస్ పార్టీ

దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర పురోగతికి శ్రీరామరక్షగా బీఆర్‌ఎస్ పార్టీ ఆవశ్యకత అనివార్యమని ఆ పార్టీ జిల్లా నాయకుడు పల్ల సుందర్‌రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతోపాటు సీర్మాల, మున్పహాడ్ తదితర గ్రామాల్లో సుధీర్‌కుమార్ గెలుపు కోసం మండల నాయకులు ఉపాధి హామీ పనుల ప్రదేశంతోపాటు ఇంటింటా విస్తృత ప్రచారం చేపట్టారు. దయాకర్, రవి, నర్సిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రామచంద్రయ్య, మైసయ్య, సంజీవరెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

పాలకుర్తి : బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్‌స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ శాసన సభ స్పీకర్ మధుసూధనాచారి తదితరులు పాల్గొన్నారు.

‘చామల’ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి



జనగామ: ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

జనగామ: భువనగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని మాజీ మార్కెట్, మున్సిపల్ చైర్మన్లు వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, ఎర్రమల్ల సుధాకర్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎండీ అన్వర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు పిలుపునిచ్చారు. మంగళవారం మునుగోడు ఎమ్మెల్యే, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు చామల గెలుపు కోరుతూ 30వ వార్డు కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మన్ జమాల్ షరీఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 28,29,30,13 వార్డుల్లో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు వనజారెడ్డి, వేమల్ల పద్మారెడ్డి, చింతకింది నరేష్, బ్రాహ్మణపల్లి రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ఇంటింటి ప్రచారం

పట్టణంలోని 16వ వార్డులో మంగళవారం డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరక భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం చేపట్టారు. పార్టీ అధికార ప్రతినిధి మేడ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ రాంమ చందర్, గాదెపాక ప్రసాద్, భిక్షపతి, ఐలయ్య, ముత్యాలు, యాదగిరి, మహ్మద్ ఇస్మాయిల్, యాదగిరి, శంకర్, రమేష్, నరసింహులు, గౌస్, శేఖర్, పాల్గొన్నారు.

సెక్యూలర్ ప్రభుత్వ ఏర్పాటుకు కాంగ్రెస్‌ను గెలిపించాలి

దేశంలో సెక్యూలర్ ప్రభుత్వం ఏర్పాటుకు ముస్లింలు ఏకతాటిపై నిలిచి కాంగ్రెస్‌ను గెలిపించాలని న్యాయవాది, భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ జమాల్‌షరీఫ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మాజీ మున్సిపల్ చైర్మన్ వేమెళ్ల సత్యనారాయణరెడ్డి స్వగృహంలో మంగళవారం మజీద్ కమిటీ అధ్యక్షునడు ఎండీ ముస్తఫ్ హైదర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భువనగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్‌రెడ్డికి ప్రతీ ముస్లిం ఓటు వేయాలన్నారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు, ఇక్బాల్, జానీ ఉన్నారు.

అభివృద్ధికే పట్టం కట్టండి

బచ్చన్నపేట: సంక్షేమ పథకాలను అందిస్తూ అభివృద్ధికి పాటు పడుతున్న అధికారి పార్టీకే పార్లమెంట్ ఎన్నికల్లో పట్టం కట్టాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కట్కూర్ గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం కొమ్మూరి మాట్లాడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు ఖాయమని అన్నారు. కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు.

బాధిత కుటుంబాలకు రూ.3.40 లక్షల ఆర్థికసాయం



రఘునాథపల్లి: మండలంలో ఇటీవల మరణించిన ఫొటో గ్రాఫర్లు రాసమల్ల యాకస్వామి, ఊడ్గుల రవీందర్‌ల కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర, జిల్లా ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.3.40 లక్షలు జమ చేసి మంగళవారం బాధితులకు అందజేశారు. మండల కేంద్రంలోని ఏఎస్‌ఆర్ గార్డెన్‌లో ఉమ్మడి జిల్లా ఫొటో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు గాదె లింగమూర్తి, మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్, జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు వడ్లాల లింగమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడు కామిని రాము, జిల్లా అధ్యక్షుడు గోలి చంద్రప్రకాష్‌లు మృతిచెందిన యాకస్వామి, రవీందర్‌ల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యాకస్వామి కుటుంబ సభ్యులకు రూ 1,75,000, ఊడ్గుల రవీందర్ కుటుంబానికి రూ 1,65,000ల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వలబోజు శ్రీనివాస్, కొన్నె సతీష్, తాడ్ర ప్రవీణ్ పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. వర్షానికి జనగామ వ్యవసాయ మార్కెట్‌లోని, పలు గ్రామాల్లో ఐకేపీ కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడిసిపోయింది. పలు గ్రామాల్లో వరిపంట నేలవాలగా మామిడి కాయలు రాలిపోయాయి. రోడ్లపై చెట్లు విరిగి పడ్డాయి. అలాగే గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచి అంధకారం నెలకొంది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.



జనగామ మార్కెట్‌లో మొక్కజొన్న రాశిలో నీటిని తొలగిస్తున్న మహిళా రైతు



జనగామలో ఎగిరి విద్యుత్ తీగలపై పడిన హోర్డింగ్ ఫ్లెక్సీ



జనగామ మార్కెట్‌లో కొట్టుకుపోయిన ధాన్యం



బచ్చన్నపేట: రోడ్డుపై విరిగిపడిన చెట్లు



తరిగొప్పుల: నేలవాలిన వరి పైరు



జనగామ రూరల్: శామీర్‌పేటలో విరిగిపడిన చెట్టు కొమ్మను తొలగిస్తున్న ఎంపీపీ కళింగరాజు



పాలకుర్తి: విద్యుత్ వైర్లపై కూలిన చెట్టు



జఫర్‌గఢ్ హనుమాన్‌తండాలో విరిగిన స్తంభం



జనగామలో ఆకాశంలో కమ్ముకున్న మబ్బులు

చేయూత



రఘునాథపల్లి: మండలంలోని మాధారం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు బూరుగు భిక్షపతిగౌడ్ (59) ఇటీవల ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందిన విషయం విదితమే. సమాచారం తెలుసుకున్న మాగౌడ్ అన్న సంక్షేమ సంఘం స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి గర్వందుల అనిల్‌గౌడ్ మంగళవారం మాధారం చేరుకొని మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి సంస్థ ద్వారా రూ.10 వేల సాయం అందజేశారు. గౌడ సంఘం నాయకులు రంగు శ్రీనివాస్‌గౌడ్, బాల్నె గట్టుమల్లయ్యగౌడ్, నరేష్‌గౌడ్, బీసీ రాజ్యాధికార సమితి జిల్లా ప్రచార కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గోపాల్‌నగర్‌లో..

బచ్చన్నపేట: మండలంలోని గోపాల్‌నగర్ గ్రామంలో అకాల వర్షానికి నష్టపోయిన వారికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ శాఖ అధ్యక్షుడు ఘనపురం నాగేష్ మంగళవారం ఆర్థికసాయం అందజేశారు. వర్షంతో పాటు భారీగా వీచిన గాలులకు వల్లాల శ్రీనివాస్, పిట్టల నర్సయ్యల ఇంటి రేకులు కొట్టుకుపోగా వారికి ఒక్కొక్కరికి రూ. 5వేల చొప్పున అందజేశారు.

ఉపాధి పనుల పరిశీలన

రఘునాథపల్లి: మండలంలోని గోవర్ధనగిరిలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న చెరువు మట్టి తవ్వకాల పనులను ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. ఉపాధిలో రైతులు ట్రాక్టర్ల ద్వారా చెరువు మట్టి తరలింపు పనులను పరిశీలించి మస్టర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రైతులు, కూలీలతో సమావేశమై పలు సూచనలు చేశారు. రైతులు ట్రాక్టర్లు సమకూర్చుకుంటే ఉపాధిలో కూలీలు ఉచితంగా మట్టి నింపుతారన్నారు. చెరువు మట్టితో భూసారం పెరిగి పంటల దిగుబడి పెరుగుతుందని. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ ఏపీఓ శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ కుంట రవి ఉన్నారు.

కేంద్ర పథకాలను వివరించాలి



మాట్లాడుతున్న ఉడిపి ఎమ్మెల్యే ఉదయ్‌కుమార్

బచ్చన్నపేట: కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమార్థం అందజేస్తున్న పథకాలపై అందరికి వివరించాలని కర్ణాటక రాష్ట్ర ఉడిపి నియోజకవర్గ ఎమ్మెల్యే ఉదయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని లిమ్రా గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, గౌడ కులస్తులతో విడివిడిగా పార్టీ మండల అధ్యక్షుడు చిమ్ముల నరేందర్‌రెడ్డి అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మాటలను నమ్మితే మోసపోతామని అన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేసే బీజేపీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌కు ఓటు వేసి నరేంద్రమోదీని మూడోసారి ప్రధాని చేయాలని కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరిగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు బేజాడి బీరప్ప, అసెంబ్లీ కన్వీనర్ బళ్ల శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ బేజాడి సిద్దులు, నాయకులు సద్ది సోమిరెడ్డి, బంగారు మహేష్, గద్ద రాజు, పెండెం నాగేష్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, రాములు, సందీప్, సీతారాములు, కేశయ్య, చిరంజీవి, చంద్రమౌళి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశంయాదవ్

రఘునాథపల్లి: దేశంలో అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మంద వెంకటేశంయాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని నిడిగొండలో బూత్ అధ్యక్షుడు మహేందర్, రవి, ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో ఉపాధి పనుల వద్దకు వెళ్లి ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని కూలీలకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి రంజిత్‌గౌడ్, నాయకులు శ్రీహరి, బాలరాజు, కరుణాకర్, బాలకృష్ణతోపాటు తదితరులు పాల్గొన్నారు.

‘కడియం కావ్యను ఓడించాలి’

స్టేషన్‌ఘన్‌పూర్: మాదిగలకు ద్రోహం చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె, కాంగ్రెస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలని ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మాదిగలంతా ఏకమై బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్‌ను గెలిపించాలని కోరారు. ఈనెల 9వ తేదీన (గురువారం) డివిజన్ కేంద్రంలోని ఈఆర్‌ఎల్ గార్డెన్‌లో నిర్వహించే మాదిగల రాజకీయ చైతన్య సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గం ఇన్‌చార్జ్ చాడ ఏలియ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోటాపోటీ ప్రచారం

నర్మెట: మండలంలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లు మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం పోటాపోటీగా ప్రచారం నిర్వహించాయి. పార్టీల మండలశాఖ అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, గ్రామశాఖల అధ్యక్షులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు నమూనా ఈవీఎంలతో ఇంటింటి ప్రచారాలు నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహారెడ్డి, జిల్లా కార్యదర్శి జయరాం నాయక్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సురేష్, శివరాజ్ గుప్తా, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రాజు, జిల్లా కార్యదర్శి అనిల్ కుమార్ ఉన్నారు.

గ్రామ దేవతల ఉత్సవాలు

దేవరుప్పుల: మండలంలోని ధరావత్‌తండా గ్రామ బొడ్రాయి, ఎల్లమ్మ, దుర్గామాత ఉత్సవాలు మంగళవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ గేమానాయక్, వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్, ఆయా పార్టీల మండల అధ్యక్షులు తీగల దయాకర్, నల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో తమ పార్టీ శ్రేణులతో వేర్వేరుగా గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్థికసాయం

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన మావురపు శ్రీశైలం, రాజారపు ఎల్లమ్మ అనారోగ్యంతో సోమవారం మృతిచెందారు. కాగా బాధిత కుటుంబాలను వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి మంగళవారం పరామర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున సాయం అందజేశారు.

చిల్పూరులో..

చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన ఆకుల సురేష్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు నారగోని రవిచందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల సాయం అందజేశారు.

జఫర్‌గఢ్: మండల కేంద్రానికి చెందిన మంచోజు రమేష్‌చారి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు దహనసంస్కారాల కోసం చందాల రూపంలో వచ్చిన రూ.32 వేల 850, క్వింటా బియ్యం బాధిత కుటుంబానికి సోమవారం అందజేశారు.

గడ్డి వామి దగ్ధం

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన కోట చిన్న రామచంద్రుకు చెందిన గడ్డి వామి మంగళవారం దగ్ధమైంది. వ్యవసాయ బావి వద్ద పశువుల కోసం నిల్వ చేసిన గడ్డి వామికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా కాలిపోయిందని బాధిత రైతు తెలిపాడు.